క్లుప్తంగా

గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు



ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వేగంగా అభివృద్ధి పనులు



వంక వీధిలో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

నందవరం: మండల కేంద్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైయినేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం స్థానిక వంక వీధిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలో ఇప్పటి వరకు 5 వర్కులకు సంబంధించి సీసీ రోడ్డు, డ్రైయినేజీలు పూర్తి చేశామని, మిగతా పనులు శరవేగంగా సాగుతున్నాయని పీఆర్ అధికారులు తెలిపారు.

బ్యాంక్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న చైర్మన్ యూకే రాజశేఖర్

ఎమ్మిగనూరుటౌన్: టౌన్‌బ్యాంక్ అభివృద్ధికి పాలకవర్గం తమ వంతు కృషి చేస్తుందని, ఖాతాదారులకు సిబ్బంది మెరుగైన సేవలందించాలని బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్ సూచించారు. శుక్రవారం స్థానిక టౌన్ బ్యాంక్‌లో పాలకవర్గ సమావేశంలో బ్యాంక్ లావాదేవీలు, రికవరీలు తదితర అంశాలపై సీఈఓ గంగాధర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో బ్యాంక్ అభివృద్ధి వైపు పయనించేలా సమష్టి కృషితో పనిచేస్తున్నట్లు తెలిపారు. టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు తట్టె బుడ్డప్ప, మహానందయ్య, సయ్యద్‌చాంద్, రజాక్, వడ్డె రంగన్న, పల్లవి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'జయహో బీసీ'కి స్పందన కరువు



వెలవెలబోతున్న టీడీపీ జయహో బీసీ కార్యక్రమం

చిప్పగిరి: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమం కార్యకర్తలు లేక వెలవెలబోయింది. శుక్రవారం చిప్పగిరిలో నియోజకవర్గ స్థాయి జయహో బీసీ కార్యక్రమం ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సభా మైదానంలో కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో హాజరైన కొద్దిమంది కార్యకర్తలు మండే ఎండలోనే సభలో పాల్గొన్నారు. సభలో కనీస వసతులు కల్పించకపోవడంపై పలువురు టీడీపీ కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన పోలీసులు

కృష్ణగిరి: మండల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని శుక్రవారం పోలీసులు ధ్వంసం చేశారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో హంద్రీనీవా కాలువ పక్కన మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. 7 కేసులకు సంబంధించి 120 టెట్రా ప్యాకెట్లు, 55 లీటర్ల నాటుసారాను నేలపాలు చేశామని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వో వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రస్తా ఆక్రమణను అరికట్టాలి

హొళగుంద: స్థానిక వాల్మీకి సర్కిల్ వద్ద ఉన్న తెక్కలకోట రస్తా ఆక్రమణను అరికట్టి సర్వే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతు సంఘం నాయకులు, రైతులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు వెంకటేష్, రైతులు హుసేన్‌పీరా, సిద్దిక్ సాబ్, పీరన్న, రెహమాన్, బాబుసాబ్ తదితరులు తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్డును కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని, దీని వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అందరికీ ఉపయోగకరంగా ఉన్న రస్తా ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాడు - నేడు.. సంక్షేమం చూడు



నాడు - టీడీపీ హయాంలో విత్తనాల కోసం హొళగుందలో రోడ్డుపై కంప వేసి భైఠాయించిన రైతులు



నేడు - చిన్నహ్యాట గ్రామంలోనే రైతులకు వేరుశనగ విత్తనకాయలు అందిస్తున్న సచివాలయ వీఏఏ

ఇది కదా.. అభివృద్ధి

హొళగుంద: గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎంత తేడా ఉందో చెప్పేందుకు ఈ చిత్రాలే నిదర్శనం. వాటిలో మచ్చుకు రెండు చిత్రాలు మాత్రమే ఇక్కడ కనబడ్తున్నాయి. ఇక వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిన వైనం, ఆరోగ్య కేంద్రాలు, 108 సేవలు, గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, గ్రామీణ రహదారులు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు, వైఎస్సార్ రైతు భరోసా, అమ్మ ఒడి, విద్యా కానుక, పంట నష్ట పరిహారాలు, పంట బీమా ఇలా ఒకటేమిటి వందకుపైగా సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారు. గత టీడీపీ హయాంలో కేవలం ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇస్తే.. నేడు జగనన్న ప్రభుత్వం అభివృద్ధిని చేతల్లో చూపించడంపై దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, రాజకీయ పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ పింఛన్‌తో పాటు అన్ని పథకాలు అందిస్తున్నారు. ప్రజలు గత టీడీపీ పాలనను, నేటి వైఎస్సార్‌సీపీ పాలనను బేరీజు వేసుకుని మళ్లీ జగనన్నే సీఎం కావాలని ముక్తకంఠంతో చెబుతున్నారు.



నాడు - టీడీపీ హయాంలో హొళగుంద పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ల కోసం వేచిఉన్న వృద్ధులు



నేడు- పెద్దగోనెహాళ్‌లో పొలం వద్దకే వెళ్లి వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు

మద్దికెర: మండలంలోని 8 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.31,31,125 మంజూరైనట్లు ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి శుక్రవారం తెలిపారు. మద్దికెర - రూ.12,92,308, పెరవలి - 6,86,563, ఎం.అగ్రహారం - రూ.4,04,280, హంప - రూ.1,42,499, బసినేపల్లి - రూ.2,17,122, బొమ్మనపల్లి - రూ.95,265, ఎడవలి - రూ.1,16,329, బురుజుల - రూ.1,76,709 మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను గ్రామాల్లో అభివృద్ధి పనులకు, పారిశుద్ధ్యం, నీటి సమస్య పరిష్కారానికి వినియోగించడం జరుగుతుందన్నారు.

పంట నమోదు గడువు పొడిగింపు

మద్దికెర: రబీ పంటల నమోదుకు ఫిబ్రవరి 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏఓ రవి తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు సమీప రైతు భరోసా కేంద్రాలలో పంట నమోదు, ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అలాగే రైతులు పండించిన కంది దిగుబడులను ప్రభుత్వం నాఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు ఏఈఓ భోజరాజు, వీఏఏలు జాకీర్, ఆనంద్, సభ్యులు భీమలింగప్ప, రేవప్ప తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలే పనితీరుకు కొలమానం



తుగ్గలిలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథ రెడ్డి

తుగ్గలి: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ప్రతి ఏడాది నిర్వహించే సామాజిక తనిఖీలే సిబ్బంది పనితీరుకు కొలమానం అని డ్వామా పీడీ అమరనాథరెడ్డి అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం ప్రాంగణంలో శుక్రవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 19 పంచాయతీల్లో దాదాపు 2,600 పనులకు పంచాయతీరాజ్ పనులు, మెటీరియల్, కూలీల వేతనాలకు రూ.26 కోట్లు ఖర్చు చేశారు. వీటిపై వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో తనిఖీలు చేసి గుర్తించిన పలు అంశాలను ప్రజా వేదికలో డీఆర్పీలు చదివి వినిపించారు. ఆయా పంచాయతీల్లో రూ.1.29 లక్షలు జరిమానా విధించగా, రూ.95,526 రికవరీకి పీడీ ఆదేశించారు.ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఉప్పర్లపల్లి పంచాయతీలో జీరో రికవరీతో ఆదర్శంగా నిలవడంతో ఫీల్డ్‌అసిస్టెంట్ రాజునాయక్‌ను అభినందించారు. పీడీ మాట్లాడుతూ ఉపాధి పనులు పక్కాగా నిర్వహిస్తూ వలసలను పూర్తిగా నివారించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. గ్రామాల్లో కూలీలు ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిప్పించాలన్నారు. పైసా ఖర్చు లేకుండా పండ్ల తోటల పెంపకానికి ఉపాధి పథకం కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని దీనిపై రైతుల్లో అవగాహన పెంచి తోటల పెంపకం విరివిగా చేపట్టేలా చూడాలన్నారు. అనంతరం కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్ పీడీకి వినతి పత్రం అందజేశారు. అడిషనల్ పీడీ మాధవీలత, డీవీఓ భాస్కర్, ఎంపీడీఓ సావిత్రి, ఎస్ఆర్‌పీ మల్లికార్జున, ఏపీఓ రామకృష్ణ, క్లస్టర్ టీఏ గంగన్న, ఈసీ ప్రదీప్ పాల్గొన్నారు.

గాయత్రీదేవి విగ్రహ ప్రతిష్ట



పూజలందుకుంటున్న గాయత్రీదేవి

హొళగుంద: స్థానిక కడ్లమాగి రస్తాలోని పెద్ద చెరువు గట్టుపై వెలసిన గాయత్రి దేవి (ఐదు మహంకాళమ్మ దేవి) నూతన ఆలయ, దేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. చాలా ఏళ్లుగా చెరువు గట్టుపై అమ్మవారి ఆలయం చిన్నగా ఉండి శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామపెద్దలు నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపనకు పూనుకున్నారు. పనులు పూర్తికావడంతో శుక్రవారం ఆలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గంగిపూజ, కుంభోత్సవం, గోపూజ, సహస్రనామ హోమాలు ఇతర ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మహాస్వామిచే విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకే 'ఆడుదాం- ఆంధ్ర'



ఆస్పరిలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం- ఆంధ్ర' క్రీడాపోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి క్రికెట్ పోటీలను ఎంపీడీఓ దశరథ రామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలస్థాయికి చేరుకున్న జట్లు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. క్రీడాకారులలో ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం పోటీలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన జట్లకు మంచి గుర్తింపుతో పాటు ప్రోత్సాహకాలు ఉంటాయని వివరించారు. అనంతరం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నందవరం-1, -2, ముగతి-1, -2, నాగలదిన్నె-1 జట్లు విజయం సాధించాయి. ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమన్న, రమేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పెద్దిరెడ్డి, నౌసన్న, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం- ఆంధ్ర కార్యక్రమం మండలంలో ఉత్సాహంగా సాగుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం బెల్డోణ గ్రామంలో మండలస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. మొత్తం 6 జట్లు పోటీలో పాల్గొనగా విన్నర్‌గా చిప్పగిరి జట్టు, రన్నర్‌గా డేగులహాలు జట్టు నిలిచాయి.

ఆస్పరి: క్రీడలలో గెలుపోటములను సహజంగా తీసుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మ క్రీడాకారులకు సూచించారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్రికెట్ పోటీలను ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర పోటీలు నిర్వహిస్తోందన్నారు. పంచాయతీ కార్యదర్శి వీరేష్, పీడీ ఆనంద్‌రావు, పీఈటీ రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: మండలంలో నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్ర క్రీడల్లో క్రికెట్ విభాగంలో మద్దికెర-3 జట్టు అత్యధిక పరుగులు సాధించి విజయం సాధించినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. రసవత్తరంగా సాగిన పోటీలో మద్దికెర -3, మద్దికెర -4 సచివాలయాల పరిధిలో రెండు జట్లు తలపడ్డాయి. మద్దికెర-3 జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 113 పరుగులు చేయగా మద్దికెర-4 జట్టు 90 పరుగులకు ఆలౌటైంది. క్రీడాపోటీలను ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఈఓలు, వ్యాయామ ఉపాధ్యాయులు సంజప్ప పర్యవేక్షించారు.



విజయం సాధించిన మద్దికెర-3 క్రికెట్ జట్టు



గూళ్యం హైస్కూల్‌లో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

హాలహర్వి: 'ఆడుదాం ఆంధ్ర' మండలస్థాయి ఖోఖో పోటీలు శుక్రవారం మండలంలోని గూళ్యం జెడ్పీ హైస్కూల్‌లో జరిగాయి. ఈ పోటీల్లో నిట్రవట్టి, గూళ్యం జట్లు తలపడగా, గూళ్యం జట్టు విజయం సాధించి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, పీఈటీ ఈరన్న తెలిపారు. ఫైనల్‌కు చేరుకున్న నిట్రవట్టి జట్టుపై గూళ్యం జట్టు గెలుపొంది నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. పీఈటీలు, అధికారులు ఉన్నారు.



నందవరంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ దశరథ రామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు

మద్దికెర: నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ నాగభూషణం శుక్రవారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలకు రెవెన్యూ అధికారులు నోటీసులు అతికించడం జరిగిందన్నారు. నోటీసులు అందుకున్న వారు 10 రోజుల్లోపు వివరణ ఇవ్వాలని, లేనియెడల ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

కార్యాలయాల నిర్మాణం పూర్తి చేయండి

ఆలూరు: పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న గ్రామ సచివాలయాలు, ఆర్బీకే భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆలూరు పీఆర్ డీఈ శ్రీరాములు సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన శుక్రవారం దేవనకొండ, ఆస్పరి మండలాల్లోని వివిధ గ్రామాలలో ఆర్బీకే, సచివాలయాలు, వైఎస్సార్‌హెల్త్ క్లినిక్‌ల పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలో 96 సచివాలయాలకు గాను ఇప్పటివరకు 35 సచివాలయ భవనాలు పూర్తయినట్లు తెలిపారు. మరో 30 భవనాల నిర్మాణాలు వివిధ దశలలో కొనసాగుతున్నాయన్నారు. అలాగే 75 ఆర్‌బీకేలకుగాను 25 భవనాలు పూర్తి చేయగా మిగతావి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. మరో రూ.4 కోట్లతో బీటీ రోడ్డు పనులను టెండర్లు జరిగాయని డీఈ వెల్లడించారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆలూరు: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కోమలాదేవి సూచించారు. ఆమె శుక్రవారం మండలంలోని వివిధ జెడ్పీ హైస్కూళ్ల నుంచి పదో తరగతి విద్యార్థుల వివరాలను హెచ్ఎంలను అడిగితెలుసుకున్నారు. మండలంలో పరీక్ష కేంద్రాలు, సిబ్బంది, విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు తీసుకోవాలసిన విషయాలపై చర్చించారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు తరగతులు నిర్వహించాలని ఎంఈఓ సూచించారు

రూ.68.79 కోట్లతో మున్సిపల్ బడ్జెట్



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపాలిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.68,79,68,431లతో అంచనా బడ్జెట్ కు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన బడ్జెట్‌పై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన బడ్జెట్ అంచనా రూ.56,59,96,761 ఉండగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలో ప్రారంభ నిల్వ రూ.40,19,97,031లు కాగా సాధారణ జమ రూ.18,27,20,500, మూలధన జమ రూ.10,32,50,000లుగా రూపకల్పన చేశారు. ఇందులో సాధారణ ఖర్చుల కింద రూ.14,89,90,000, మూలధన ఖర్చులు రూ.12,11,00,000, లోన్ల చెల్లింపునకు రూ.40,00,000 వెచ్చించనుండగా మొత్తం ఖర్చుల కింద రూ.27,40,90,000 ముగింపు నిల్వ కింద రూ.41,38,78,431లను అధికారులు ప్రతిపాదించారు. దీంతో అజెండాలోని బడ్జెట్ అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో నిబంధనల మేరకు ఎస్సీలు, వికలాంగులు, శిశు సంక్షేమానికి ఖర్చు పెట్టాల్సిన వాటిపై దృష్టి సారించాలని విపక్ష కౌన్సిలర్ దయాసాగర్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డీఈ మనోహర్‌రెడ్డి, నీరజ, విక్టర్, మేనేజర్ వరప్రసాద్, ఆర్‌ఓ బేబి, టీపీఓ గోపాలకృష్ణ, ఏఈలు శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



జొన్నగిరి జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తుగ్గలి: రెండు దశాబ్దాల తర్వాత స్నేహితులంతా తిరిగి ఒక్కచోట కలిస్తే ఆ ఆనందం మాటల్లో చెప్పలేనిది. మండల పరిధిలోని జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1996-2001 వరకు ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అంతా చదివిన పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. స్నేహితులు ఒకరినొకరు పలకరించుకుంటూ ఆలింగనం చేసుకుంటూ కుశల ప్రశ్నలతో యోగక్షేమాలు తెలుసుకుంటూ సంతోషంగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

జగనన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

చిప్పగిరి: రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి అన్నారు. జగనన్నతోనే రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజల సంక్షేమం కొనసాగుతాయన్నారు. పార్టీ అధిష్టానం ఆయన్ను ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. విరుపాక్షి మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యం 175 అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తనపై అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు.

సురక్ష.. పేదల ఆరోగ్యానికి రక్ష



ఆలూరులో ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కృష్ణగిరి: జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామాల్లో అందరికీ మెరుగైన వైద్యం అందుతోందని గోవర్ధనగిరి పీహెచ్‌సీ వైద్యులు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని మూడు గ్రామాల నుంచి వచ్చిన 306 మందికి వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపారు. నలుగురు స్పెషలిస్ట్ డాక్టర్ల బృందంచే వైద్య సేవలు అందించడంతోపాటు ఎక్స్‌రే సేవలు కూడా అందించామన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందిస్తోందని ఎంపీడీఓ అల్లబకష్ అన్నారు. శుక్రవారం ఆలూరు సచివాలయం-3 పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. గర్భిణులకు రక్త పరీక్షలు చేసి మందులు అందించారు. 254 మంది రోగులకు పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, డాక్టర్ శాంతి హెల్త్ సూపర్‌వైజర్లు కళావతి, బాషా తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం-2.0 కార్యక్రమం విజయవంతమైంది. సర్పంచ్ ఎల్లరాముడు, కార్యదర్శి నాయక్, గ్రామ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం-1 పరిధిలో జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని గ్రామస్తులు వినియోగించుకున్నారు. ఉచితంగా రక్త పరీక్షలు, మందులు, కంటి పరీక్ష సేవలు పొందారు. నలుగురు స్పెషలిస్టు వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య, ఆశా సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు సేవలందించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాముడు, రంగన్న శిబిరాన్ని పర్యవేక్షించారు.



గోవర్ధనగిరిలో వైద్య సేవలందిస్తున్న స్పెషలిస్టు డాక్టర్



తొగర్చేడులో వైద్య సేవల కోసం వచ్చిన ప్రజలు

వివేకానందుడి స్ఫూర్తితో ముందుకెళ్లాలి

దేవనకొండ: మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవర్గ నాయకులు ఉచ్చీరప్ప, రఘునాథ్, దేవనకొండ ఎంపీటీసీ ఉచ్చీరప్ప మాట్లాడుతూ వివేకానంద స్ఫూర్తిని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కిరణ్‌కుమార్, సమరసత సేవా ప్రముఖ్ వీరేష్, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఈమేష్, తదితరులు పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు చేయాలి

నందవరం: సెర్ప్ (డీఆర్‌డీఏ-వైకేపీ) ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని ఆ సంఘం ఉద్యోగులు ఏపీఎం చిన్నవీరన్న, సీసీ షబీన బేగం డిమాండ్ చేశారు. శుక్రవారం సెర్ప్ జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో వైకేపీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ప్రమోషన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. సీసీలు జనార్ధన్, చెన్నమ్మ, వసుంధర పాల్గొన్నారు.